క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ (మెహర్‌నగర్) 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 24న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వుడా కాలనీ, గొంతినవానిపాలెం, వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాజువాక, మింది పరిధిలో..

గాజువాక: గాజువాక, మింది ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పంతులుగారి మేడ, కృష్ణ మందిరం ఫీడర్లకు శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా గాజువాక హైస్కూల్ రోడ్, పెంటయ్యనగర్, జోగవానిపాలెం, సాయిరామ్‌నగర్, గాజువాక మెయిన్ రోడ్, శ్రీకన్య థియేటర్, పంతులుగారి మేడ, మెహర్‌నగర్, కైలాసనగర్ ప్రాంతాలకు ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు, తిరిగి తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

'ప్రతి ఓటరునూ కలుసుకోవాలి'

గాజువాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించడం కోసం కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఓటు కలిగి ఉన్న పట్టభద్రులందరినీ కలుసుకోవాలని సూచించారు. బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత



నగదు, సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పింఛన్ పొందుతున్న జాజుల చిన రామస్వామి మరణించడంతో ఆయన కుటుంబానికి ట్రస్ట్ అండగా నిలిచింది. వారికి రూ.3వేల నగదు, నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందించింది. గ్రామ పెద్దలు అమరపిని త్రినాథ్, దాసరి వెంకటరమణల చేతుల మీదుగా వీటిని అందించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు చెప్పారు. కార్యక్రమంలో సలహాదారు పట్నా రామ అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, లక్కరాజు రాము, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు



కంటి ఆపరేషన్లకు ఎంపికైనవారు

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ పద్మ ఆధ్వర్యంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 35 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిలో 15 మందిని నగరంలోని విశాఖ కంటి ఆస్పత్రికి, 20 మందిని విజయనగరంలో కంటి ఆస్పత్రికి తరలించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ధనలక్ష్మి, గాజువాక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భవనాలు శిథిలం.. నిత్యం భయం

- తోకాడలో నిరుపయోగంగా స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లు
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- పట్టించుకోని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- పరిసర ప్రాంతాల వారికి తప్పని అవస్థలు



ఆటోనగర్‌లో గల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన శిథిల క్వార్టర్లు



తోకాడలో అస్తవ్యస్తంగా ఉన్న శిథిల నివాసాలు

అక్కిరెడ్డిపాలెం: ఖరీదైన నివాసాల మధ్య శిథిల భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి. నిర్మానుష్యంగా ఉన్న ఈ క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో పరిసర ప్రాంతాల వారు ఇబ్బంది పడుతున్నారు. తోకాడలోని ఈ నివాసాలకు సమీపంలోనే ఆటోనగర్ రెసిడెన్షియల్ ఏరియా ఉంది. ప్రశాంతమైన ఈ ప్రాంతంలో ఇటువంటి కార్యకలాపాలు కొనసాగడంతో ఆటోనగర్ క్వార్టర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల కోసం జీవీఎంసీ 71వ వార్డు ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలో 1984 నుంచి 1986 మధ్య కాలంలో 5 బ్లాకుల్లో 40 వరకు నివాసాలు, ఆటోనగర్ ఆర్చి నుంచి ప్రధాన రహదారి ఎడమవైపు భెల్ గోడ ఎదురుగా సుమారు 20 నివాసాలు నిర్మించి ఇచ్చింది. అప్పట్లో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏపీఐఐసీ నుంచి ఈ స్థలాలు కొని, అన్ని సౌకర్యాలతో సిబ్బందికి క్వార్టర్లను నిర్మించి ఇచ్చింది. కాలక్రమంలో అందరూ వేర్వేరు ప్రాంతాల్లో సొంత నివాసాలు నిర్మించుకుని, క్వార్టర్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఖాళీగా ఉన్న ఈ క్వార్టర్లు క్రమేపీ శిథిలమయ్యాయి. క్వార్టర్లలోని తలుపులు, కిటికీలు, కరెంట్ వైర్లు ఇతర ఫర్నిచర్‌ను పలువురు అపహరించుకుపోయారు. ఈ ప్రాంతం నిర్మానుష్యం కావడం, చుట్టూ తుప్పలు పేరుకుపోవడంతో శిథిల భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. బయటి నుంచి వస్తున్న యువకులు, కొందరు స్థానిక యువకులతో కలిసి ఈ క్వార్టర్లలో మద్యం, గంజాయి సేవించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని స్థానిక ఆటోనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇటీవల శృతి మించి డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. వీరి ఆగడాలను వారి కుటుంబ పెద్దలకు తెలిపినా, పట్టించుకోలేదన్నారు.

స్పందించని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం

శిథిలమైన క్వార్టర్లను పడగొట్టి ఆ స్థానంలో గార్డెనింగ్, గ్రీనరీ, పార్కుల నిర్వహణను చేపట్టి, తమకు బాధ్యత అప్పగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని కోరినట్లు ఆటోనగర్ క్వార్టర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అయినా వారు పట్టించుకోలేదన్నారు. దీంతో ఈ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు క్వార్టర్ల నుంచి విషసర్పాలు నేరుగా తమ నివాసాల్లోకి చొరబడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అలా వదిలేస్తే ఎలా?

శిథిలమైన క్వార్టర్లను ఇలా వదిలేయడంతో చాలా ఇబ్బందిగా పడుతున్నాం. ఈ భవంతులు ఆకతాయిలకు అ డ్డాగా, విషకీటకాలు, పందులు, కుక్కలకు నివాసప్రాంతా లుగా మారాయి. దీనితో సంబంధం లేదన్నట్లుగా స్టీల్‌ప్లాంట్ అధికారులు వ్యవహరిస్తున్నారు. యాజమాన్యం అలా వదిలేస్తే ఎలా? పరిసర ప్రాంతాల వారు ఎలా నివసిస్తారు?

– తులసీప్రసాద్, ఆటోనగర్ క్వార్టర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

పచ్చదనం పెంపొందించవచ్చు

తోకాడలో శిథిలమైన క్వార్టర్లు తొలగించి, చక్క గా అభివృద్ధి చేయవచ్చు. పచ్చదనం పెంపొందించవచ్చు. పార్కుగా తీర్చిదిద్దితే అందరికీ ఎంతో ఉపయోగం. అలా నిర్మించి ఇస్తే, మేమే నిర్వహించుకుంటాం. దీనిపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని కోరాం. కానీ ఏ స్పందనా లేదు.

– బ్రహ్మాజీ, ఆటోనగర్ క్వార్టర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి

భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

- విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం
- స్టీల్‌ప్లాంట్ జీఎం (సేఫ్టీ) రౌత్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

అగనంపూడి: మనిషి చేసే ప్రతీ పనిలో భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) ఎస్.కె.రౌత్ అన్నారు. నా భద్రత.. నా బాధ్యత అనే విషయంలో ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనం ఉదయం లేచినప్పటి నుంచి పడుకునే వరకు భద్రతను పట్టించుకోవల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతీ విద్యార్థి భద్రతను గమనంలోకి తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. అనంతరం రోడ్డు భద్రతను పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉక్కు ఏజీఎం ఎస్.జె.ప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం ఎం.కృష్ణారావు, ఉద్యోగులు యల్లపు సాంబశివరావు, మోహనరావు, భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతపై ప్రకృతి పరిరక్షణ బాధ్యత



పర్యావరణ సదస్సులో పాల్గొన్న డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు

గాజువాక: ప్రకృతిలో ప్రధానమైన భూమి, గాలి, నీరును కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని ఎంతో ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటినుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను తడి, పొడి, హానికారిక వ్యర్థాలుగా విభజించి ఇంటికి వచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ వాహనం సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇలా చేయకపోతే వివిధ వ్యాధులకు గురయ్యే అవకాశం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారతీయులకు విశిష్ట స్థానం



డీకె శివకుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ సంస్థల చైర్మన్ రత్తయ్య, వీసీ కృష్ణదేవరాయలు

అగనంపూడి: భారతదేశ విద్యావేత్తలు, మేధావులకు ప్రపంచ దేశాల్లో ప్రముఖ స్థానం ఉందని విద్యావేత్త, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన విద్యా విధానంపై ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశానికి చెందిన ఇంజినీర్లు, విద్యావేత్తలు అంతర్జాతీయ స్థాయిలో కీర్తిప్రతిష్టలను గడించారన్నారు. విద్యారంగంలో మార్పులకు అనుగుణంగా బోధన సాగిస్తున్న అధ్యాపకులను అభినందించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కర్ణాటక ఎంపీ డి.కె. సురేష్, విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, దువ్వాడ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల పిన్సిపాల్ జె.సుధాకర్, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో ప్లాంట్ పరిరక్షణ



శిబిరంలో పాల్గొన్న స్టీల్ ఎస్‌ఎంఎస్-2 ఉద్యోగులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు సంకల్పంతో ఉద్యోగులు పోరాటాలు చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 742వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఎస్‌ఎంఎస్–2 డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతోమంది ప్రాణాలను, భూములను త్యాగం చేసి సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తామనడం సరికాదన్నారు. దీనికోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ దుకాణాలు తొలగించాలి



రోడ్డును అనుకుని ఏర్పాటు చేసిన కంటైనర్లు

అగనంపూడి: ప్రభుత్వ భూమిలో, వందడుగుల రోడ్డు కోసం కేటాయించిన ప్రాంతంలో, రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన కంటైనర్లను వెంటనే తొలగించాలని స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అగనంపూడి కూడలి నుంచి స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలోని అభిరామ్ అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ప్రశాంతినగర్ ప్రధాన రహదారిలో కంటైనర్లు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉంటాయని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఇదే స్థలంలో అక్రమంగా రేకుల షెడ్లు నిర్మిస్తే, వాటిని అధికారులు తొలగించారని, మళ్లీ అదే చోట వీటిని ఏర్పాటు చేశారని తెలియజేశారు. జీవీఎంసీ సిబ్బంది ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు.

కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన



మాక్ డ్రిల్‌లో భాగంగా కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్కాపురం: కెమికల్ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై కార్మికులకు అవగాహన,మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఈస్ట్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, ఆపదలో ఉన్న వారిని ఎలా కాపాడాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి వైద్యం అందించాలో వివరించారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఎం ప్రతినిధి పి.ఎస్. సర్కార్,రాష్ట్ర డిజార్డర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రసాయన పరిశ్రమల్లో తలెత్తే ప్రమాదాల నుంచి తప్పుకునే విధానాలు, కార్మికులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావు, కోరమాండల్ అధికారి శ్రీనివాసరావు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



పెదగంట్యాడ పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి

పెదగంట్యాడ: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ స్టేట్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ శాంతి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ జీవనరాణి సూచించారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. ఆస్పత్రి ఓపీని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించడంతో పాటు వాటిని సక్రమంగా పరిశీలించి ఆపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ శాంతి అన్నపూర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులపై సర్వే చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీఐ కార్యకర్త

గాజువాక: గాజువాక ప్రాంతంలో వక్ఫ్ ఆస్తులపై సర్వే చేయాలని ఆర్టీఐ కార్యకర్త బాషా కోరారు. ఈ మేరకు ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. గాజువాకలోని మసీదు, దర్గా, ఈద్గాలు, శ్మశానాలు, గౌస్ ఏ అంజుమన్ మదరసా, ముస్లిం సామాజిక భవనం తదితర వక్ఫ్ ఆస్తులపై అనధికార వ్యక్తుల పెత్తనం అధికమైందని పేర్కొన్నారు. సున్నీ జామా మసీదుకు కమిటీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సయ్యద్ మదీనా షా (దర్గా)కు కమిటీ లేదని, అయినా దానికి కమిటీ ఉన్నట్టు కొంతమంది ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. దీనిపై దృష్టి పెట్టి, చర్యలు చేపట్టాలని కోరారు.

రహదారి నిర్మాణానికి అనుమతించాలని వినతి



పోర్టు చైర్మన్ కు వినతిపత్రం అందిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: మింది గ్రామం నుంచి వైజాగ్ పోర్టు రోడ్డుకు వెళ్లే మార్గంలో రహదారి నిర్మాణానికి అనుమతించాలని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, పోర్టు చైర్మన్ రామమోహనరావును కోరారు. గురువారం ఆయన్ను కలిసి, వినతిపత్రం అందజేశారు. పరిశీలించి, సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపడతామని చైర్మన్ తెలిపారని లతీష్ చెప్పారు.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ఆయుష్ వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గురువారం ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ ఆదేశానుసారం రెండు రోజుల శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆయుష్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జితిన్, డాక్టర్ పి.నీహారిక, ఉక్కు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఆయుష్ వైద్య ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. శిబిరంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ అడ్మిన్ అధికారి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన మ్యాజిక్ ప్రదర్శనలు



ప్రదర్శనలో పాల్గొన్న మెజీషియన్లు

డాబాగార్డెన్స్: ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్(సీనియర్) 110వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఇంద్ర జాలికుల(మెజీషియన్స్) దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ మెజీషియన్స్ అసోసియేషన్ నిర్వహించిన మ్యాజిక్ ప్రదర్శనలు నగర వాసులను అబ్బురపరిచాయి. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఈ ప్రదర్శనలను తాజ్ గేట్‌వే జనరల్ మేనేజర్ గోపాల్, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు నండూరి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 మంది మెజీషియన్లు చేపట్టిన ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. అనంతరం విశాఖ మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీజీ సురేష్, కార్యదర్శి అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ 2016 నుంచి ఏటా సర్కార్ జయంతి రోజున ఓ పండగలా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

27 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఆధార్ క్యాంప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 27 నుంచి ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ-1)లో ఉద యం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్న క్యాంప్‌లో ఆధార్ కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. మార్చి 11 వరకు నిర్వహించనున్న ఈ క్యాంప్‌లో రోజుకు 250 మందికి సేవ లు అందించనున్నారు. గుర్తింపు కార్డు, చిరునా మా పత్రాలను తీసుకురావాలని పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీ ప్లీనరీలో ప్రైవేటీకరణ వ్యతిరేక గళం



జాతీయ నాయకులతో స్టీల్ ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: జాతీయ ఐఎన్‌టీయూసీ ప్లీనరీలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని లేవనెత్తారు. న్యూఢిల్లీలో ప్రారంభమైన ప్లీనరీకి హాజరైన స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకించారు.రాష్ట్రంలోని అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. పలుమార్లు పార్లమెంట్‌లో ఎంపీ వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు జాతీయ నాయకులను కలిసి, ప్రైవేటీకరణ ఉద్యమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి, స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు గంటా కామరాజు, కారు రమణ, నడుపూరు వెంకన్న, జి.కృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



తులసీదళాల నడుమ అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలు వురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మంపడంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.